## క్లుప్తంగా

### వైభవంగా పుష్పయాగం



**పిట్టలవానిపాలెం:** పిట్టలవానిపాలెం గ్రామంలో కొలువు తీరిన సీతారామచంద్రస్వామికి జ్యేష్టాభిషేక మహోత్సవ పూర్వక పట్టాభిషేక మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం శ్రీనివాసాచార్యులు, బృందావనం గోపీచంద్ గురువారం స్వామికి పుష్పయాగం నిర్వహించినట్లు తెలిపారు. సీతారామచంద్ర స్వామికి పుష్యమి నక్షత్ర యుక్త అభిజిత్ లగ్నమునందు మధ్యాహ్నం 12.45గంటలకు శ్రీరామపట్టాభిషేక మహోత్సవం జరిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అన్న సంతర్పణ గావించారు.

### డాక్టరేట్ గ్రహీత శ్రీనివాసరావుకు సన్మానం



**రేపల్లె రూరల్:** గ్రామీణాభివృద్ధిలో హైదరాబాద్‌లోని క్రిస్టియన్ యూనివర్శిటీ (అమెరికాలోని క్రిస్టియన్ యూనివర్శిటీ బ్రాంచ్) నుంచి ఇటీవల డాక్టరేట్ పొందిన నల్లూరు సౌత్ సర్పంచ్ కోనా శ్రీనివాసరావును గురువారం పలువురు ఘనంగా సత్కరించారు. రాఘవ విద్యా సంస్థల కరస్పాండెంట్ మోపిదేవి శ్రీనివాసరావు కార్యాలయంలో శ్రీనివాసరావును సన్మానించారు. వివిధ సంఘాల నాయకులు కొల్లూరు వాసు, సీహెచ్ మణిలాల్, దామెర్ల రాజారావు, బడుగు ఝికోవ్ పాల్గొన్నారు.

### రేపు 'నగరం' సర్వసభ్య సమావేశం

**నగరం:** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వ సభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ ఎస్.రాధారమణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ చింతల శ్రీ కృష్ణయ్య అధ్యక్షతన ఈ నెల 27న సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని వెల్లడించారు. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందన్నారని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు సమావేశానికి ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి విధిగా హాజరుకావాలని తెలిపారు.

### నాటు సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్



**నగరం:** నాటు సారా తయారు చేసినా, విక్రయించినా, తరలించినా కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) సీఐ దేవర శ్రీనివాసరావు హెచ్చరించారు. పరిశావారిపాలెంలో నాటుసారా విక్రయిస్తున్న మహిళను గురువారం సెబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ వివరాలు వెల్లడించారు. శిరిపూడి శివారు పరివారిపాలెంలో ఏమినేని వెంకటేశ్వరమ్మ అనే మహిళ నుంచి రెండు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వెంకటేశ్వరమ్మను అరెస్ట్ చేసి, రేపల్లె సబ్ కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా.. నాటుసారా విక్రయాలు జరుగుతుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

### వేడుకగా గుండి పార్వతి గ్రామోత్సవం



**భట్టిప్రోలు:** భట్టిప్రోలు హిందూ శ్మశాన వాటికలోని గుండి పార్వతీ అమ్మవారి తిరునాళ్ల గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పూజా కార్యక్రమాలను అర్చకులు భట్టిప్రోలు కార్తికేయ శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఘటంతో గ్రామోత్సవం కావించారు. భక్తులు పసుపు బండ్లు తీసుకువచ్చి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. భట్టిప్రోలు గ్రామ దేవత దండి పార్వతీ అమ్మవారి సహోదరి గుండి పార్వతీ అమ్మవారికి ఏటా ఘనంగా పూజలు నిర్వహిస్తుంటారు. శుక్రవారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, భక్తులు ప్రభలను కట్టుకుని అమ్మవారి సన్నిధికి తీసుకు వస్తారు. మొక్కలు చెల్లించుకోనున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

# ప్రజా సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

**'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి మేరుగ నాగార్జున**



సంక్షేమ లబ్ధి కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

**చినపరిమి(వేమూరు):** రాష్ట్రంలో ప్రజా సంక్షేమం వైఎస్సార్ సీపీతో సాధ్యమైందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు అందక పోతే తన దృష్టికి తీసుకు రావాలని, వెంటనే పరిష్కారం చూపించడం జరుగుతుందని ప్రజలకు చెప్పారు. గ్రామంలో రోడ్లు, విద్యుత్ స్తంభాల సమస్యలను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో రోడ్లు వేస్తామని మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. విద్యుత్ స్తంభాలను వెంటనే వేయాలని ఆ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధితో సుపరి పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు మద్దతు తెలిపాలని కోరారు. వేమూరు నియోజక వర్గంలోని అన్నీ.. రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని మంత్రి వెల్లడించారు. సచివాలయం నిధులు ఉన్నాయని, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పనులు చేసేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం వేగంగా కొన సాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, సర్పంచ్ మేరుగ సుభాషిణి, ఉప సర్పంచ్ ఆవుతు సాయిబాబు రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గాదె శివరామ కృష్ణారెడ్డి, చండూరు గ్రామ సర్పంచ్ వుయ్యూరి అప్పిరెడ్డి, తమ్మా బసివి రెడ్డి, తమ్మా పాములరెడ్డి, ఎంపీటీసీ అవుతు శివ పార్వతి, పమిడి కొండల రాజేష్ కుమార్, వుయ్యూరి అంజిరెడ్డి, అళ్ల సత్యనారాయణ రెడ్డి, కొల్లి వెంకటరెడ్డి, కుదేటి కృష్ణ మోహన్ రెడ్డి, వుయ్యూరి భాస్కర్ రెడ్డి, పులివర్తి మోషే, ఏసుబాబు, మర్రిరెడ్డి బసివిరెడ్డి, మండల ఉప అధ్యక్షుడు రమణా రెడ్డి, చిన గాదెలవర్రు గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**నేడు గడప గడపకు మన ప్రభుత్వం..**

చుండూరు మండలంలోని చిన పరిమి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం ఉదయం 7 గంటలకు మంత్రి మేరుగ నాగార్జున నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు గాదె శివరామ కృష్ణారెడ్డి తెలిపారు.

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు**



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

**రేపల్లె:** గ్రామాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. రాజుకాల్వలో ఆర్ఆర్‌డీఎఫ్, ఆసిస్ట్ సంయుక్త సహకారంతో రూ.50లక్షల వ్యయంతో పునరుద్ధరించిన తాగునీటి చెరువును గురువారం సాయంత్రం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. చెరువును వినియోగంలోకి తీసుకురావటంతో తీర ప్రాంత గ్రామాలైన లంకెవాని దిబ్బ నుంచి మోళ్ల గుంట వరకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎంపీ తెలిపారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, నియోజకవర్గ నాయకుడు మోపిదేవి రాజీవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, సర్పంచ్ తలశిల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేయాలి



కార్యకర్తలకు సూచనలిస్తున్న ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు

**కొల్లూరు:** అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, చిన్నారుల పోషణను చిత్తశుద్ధితో నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి అంగన్‌వాడీ కార్యకర్తపై ఉందని కొల్లూరు ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు అన్నారు. గురువారం కొల్లూరు మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తల నెలవారి ప్రగతిపై ఆయన సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి చిన్నారికి తగిన పౌష్టికాహారం అందించి, వారు వయసుకు తగ్గ బరువు, ఎత్తు పెరిగే విధంగా చూడాలని కోరారు. పౌష్టికాహారం లోపం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడే చిన్నారులను గుర్తించి, తగిన ఆహారం అందించాలని స్పష్టం చేశారు. ఆకు కూరలు, పౌష్టి కాహారాన్ని నిర్దేశిత సమయానికి అందించడం, కేంద్రాల పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు విజయలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

## వాలంటీర్లు సంక్షేమ వారధులు

**బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి**



వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

**బాపట్ల అర్బన్:** వెలకట్టలేని సేవలతో ప్రభుత్వానికి అండగా ఉంటూ సంక్షేమ వారధులుగా వలంటీర్లు నిలుస్తున్నారని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. పిన్నిపోయినవారి పాలెంలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లను ఎమ్మెల్యే సన్మానించారు. కొండుబోట్లవానిపాలెం, తూర్పు బాపట్ల, పిన్నిబోయిన వారిపాలెం సచివాలయాలకు సంబంధించిన వలంటీర్లను సేవరత్న, సేవా మిత్రా పురస్కారాలతో సత్కరించి సర్టిఫికెట్లు, బ్యాడ్జీలు, ప్రోత్సాహకం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ దేశానికి ఆదర్శంగా వలంటీర్ వ్యవస్థ ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు సకాలంలో సేవలు అందించాలనే లక్ష్యంతో వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారని చెప్పారు. ఎంతో మంది వృద్ధులకు, మంచం పట్టిన అవ్వతాతలకు, రోగులు ప్రతి నెలా 1వ తేదీన క్రమం తప్పకుండా పింఛన్ తీసుకోగలుగుతున్నారని పేర్కొన్నారు. ఒక్క పింఛన్ మాత్రమే కాకుండా.. అన్ని రకాల సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు.. లబ్ధిదారులకు అండగా ఉంటూ, సచివాలయ సిబ్బందితో సమన్వయంతో ముందుకు సాగుతున్నారన్నారు. వీరందరికీ ప్రభుత్వం తరపున సన్మానం చేస్తూ గౌరవం కల్పిస్తున్నామన్నారు. ఏడాదిలో ఎన్నికలు వస్తున్నాయని మరోసారి అధికారంలోకి రానున్న జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు. జెడ్పీటీసీ పిన్నిబోయిన ఎస్తేరురాణి, ఏఎంసీ చైర్మన్ పిన్నిబోయిన ప్రసాద్, వడ్డీముక్కల డేవిడ్, సముద్రాలు డేవిడ్, రాజ్ మోహన్, రాజ్, టి.సుబ్బారావు, ఎంపీడీవో ఎ.రాధాకృష్ణ, పల్నాటి శ్రీరాములు, అధికారులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నేడు, రేపు వలంటీర్లకు అవార్డుల ప్రదానం**

**కర్లపాలెం:** ఈ నెల 26, 27 తేదీల్లో వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులను ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రదానం చేయనున్నట్లు ఎంపీడీఓ డి.రాంబాబు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 కర్లపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో.. కర్లపాలెం, నల్లమోతువారిపాలెం, కొత్తనందాయపాలెం, పాతనందాయ పాలెం, ఏట్రవారి పాలెం, బుద్ధాం, యాజలి, దుండివారి పాలెం, దమ్మనవారి పాలెం, బోలాయ పాలెం, నాగరాజు పాలెం గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు, 27న పేరలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో .. చింతాయపాలెం, గణపవరం, పెదపులుగువారి పాలెం, నర్రావారిపాలెం, తుమ్మలపల్లి, పేరలిపాడు, పెదగొల్లపాలెం, పేరలి, సమ్మెటవారిపాలెం గ్రామ పంచాయతీల పరిధిలోని వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయం సిబ్బంది, కన్వీనర్లు హాజరవుతారని తెలిపారు.

## సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



**రేపల్లె రూరల్:** ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధుల బారినపడి, నిస్సహాయ స్థితిలో ఉన్న రోగులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతోందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. చోడాయపాలెం గ్రామస్తుడు మండే రత్నబాబు అనారోగ్యానికి గురయ్యి, చికిత్స పొందాడు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3.50లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మోపిదేవి ఆయన స్వగృహంలో గురువారం అందజేశారు. వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు ఉన్నారు.

## ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం

- సచివాలయ వ్యవస్థతో పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు
- ప్రతిపక్షాలు బురద చల్లటం విరమించుకుని అభివృద్ధిలో పాలు పంచుకోవాలి
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



గాయపడిన వలంటీరుకు పురస్కారం, ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీ మోపిదేవి

**రేపల్లె రూరల్:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. రాజుకాల్వ, గంగడిపాలెం, మోళ్లగుంట, పిరాట్లంక, పోటుమెరక, తుమ్మల, చోడాయపాలెం, వడ్డీవారిపాలెం గ్రామాల వలంటీర్లకు గురువారం రాజుకాల్వ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ..ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల వద్దకు త్వరితగతిన చేర్చేందుకు వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశంలోని వివిధ రాష్ట్రాలకు ఆదర్శకంగా నిలుస్తున్నాయని కొనియాడారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు ప్రజలకు అందించిన సేవలు ఎనలేనివన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురద జల్లే ప్రయత్నాలను చంద్రబాబు అండ్ కో బృందం విరమించుకోవాలని హితవు పలికారు. అభివృద్ధిలో పాలుపంచుకుని భాగస్వాములు కావాలే గాని, లేనిపోని నిందారోపణలు చేయటం సమంజసం కాదన్నారు. ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారని, ప్రజలు చంద్రబాబుకు మరోసారి బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు. మండలంలో సేవా వజ్రకు ఇరువురు, సేవా రత్నకు ఐదుగురు, సేవా మిత్ర పురస్కారాన్ని 93 మందికి అందించి, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, నియోజకవర్గ నాయకులు మోపిదేవి రాజీవ్, ఎంపీపీ పెనుమాల సుశీల, జెడ్పీటీసీ బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షుడు పీతా వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ మల్లికార్జునరావు, తహసీల్దార్ మల్లికార్జునరావు, సర్పంచ్ రాజుకాల్వ శ్రీను, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**వలంటీరుకు రూ.20వేల ఆర్థిక సాయం..**

ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై గాయపడిన లంకెవానిదిబ్బ వలంటీరు రాజీవ్‌కు ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. రాజీవ్‌ను అన్ని విధాలుగా అందుకుంటామని భరోసా ఇచ్చారు.

**రేపల్లెలో...**

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 14 సచివాలయాల పరిధిలోని వలంటీర్లను ఎంపీ మోపిదేవి అభినందించి, పురస్కారాలు అందజేశారు. సేవా రత్న ఐదుగురు, సేవా మిత్ర పురస్కారాలను 254 మందికి ప్రదానం చేసి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## రక్తహీనత నివారణకు కృషి చేయాలి

**డీఎల్‌పీఓ శరత్ బాబు**



అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో శరత్‌బాబు.

**కర్లపాలెం:** రక్త హీనత నివారణకు కృషి చేయాలని బాపట్ల డీఎల్‌పీఓ పీడీఎస్ శరత్‌బాబు సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో ఆయన రక్త హీనత నివారణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడారు. గ్రామాల్లో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలు, ఎదుగుదల సక్రమంగా లేని చిన్నారులను గుర్తించాలని చెప్పారు. వారికి అదనపు పౌష్టికాహారం ఇవ్వటం ద్వారా రక్తహీనత నివారించగలుగుతామని తెలిపారు. కర్లపాలెం మండల పరిధిలో గర్భిణులు 51, బాలింతలు 61మంది రక్తహీనతతో భాదపడుతున్నారని నివేదిక వివరించారు. అలాగే ఎత్తుకు సరిపడా బరువు, బరువుకు సరిపడా ఎత్తు ఎదగని వారు సుమారుగా 29 మంది చిన్నారులు ఉన్నారని తెలిపారు. వీరిపట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్ వైజర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, పౌష్టికాహారం అందించాలని స్పష్టం చేశారు. డాక్టర్ సుహానా బేగం, ఈఓపీఆర్డీ ఎలీషాబాబు, సూపర్ వైజర్లు శేషుకుమారి సౌజన్య, నాగమల్లేశ్వరి తదితరులు ఉన్నారు.

## మహిళ అదృశ్యంపై కేసు నమోదు

**కర్లపాలెం:** ఓ వివాహిత అదృశ్యమైన ఘటన చింతాయపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య వివరాల మేరకు.. చింతాయపాలెం గ్రామానికి చెందిన ప్రకాష్‌బాబు అలియాస్ యాకోబు కుమార్తె 24ఏళ్ల గొర్రుముచ్చు అరుణకు 2020లో వివాహమైంది. అనంతరం ఆరు నెలలకు భర్తతో విడాకులు తీసుకుని తండ్రి వద్దే ఉంటోంది. మానసికంగా ఆరోగ్యం సరిగా లేని అరుణ.. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. ఈ క్రమంలో అరుణ తండ్రి ప్రకాష్‌బాబు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. అరుణ ఆచూకీ తెలిసిన వారు సెల్ నంబర్ 94409 00870 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శివయ్య కోరారు.

## 28న యాదవ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

**తెనాలి:** యాదవ ఎంప్లాయీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెనాలి నియోజకవర్గంలో పదో తరగతి ఉత్తీర్ణులైన యాదవ విద్యార్థులకు ఈ నెల 28న ప్రోత్సాహకాలను అందించనున్నట్టు ఫౌండేషన్ నిర్వాహకులు ఎనికేపల్లి అంబరీషుడు, అంగిరేకుల వెంకటప్రసాద్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటకు స్థానిక రైల్వే స్టేషను రోడ్డులోని బృందావనం హోటల్‌లో జరిగే ఈ సమావేశంలో డాక్టర్ తాడిబోయిన అఖిలేష్, డాక్టర్ తాడిబోయిన అవినాష్, డాక్టర్ ఎనికేపల్లి అనిల్‌కుమార్, డాక్టర్ నల్లమేకల శివరామకృష్ణ, డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, యాదవ రాజకీయ పెద్దలు పాల్గొంటారని తెలిపారు.

## మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి



సమావేశంలో వివరాలు తెలుసుకుంటున్న ఎంపీపీ

**వేమూరు:** మండలాభివృద్ధికి అధికారులందరూ పూర్తిగా సహకరించాలని ఎంపీపీ యల్లమాటి మోహనరావు కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అధ్యక్షత వహించారు. వివిధ శాఖల పరిధిలో పనుల ప్రగతిని సమీక్షించారు. ఖరీఫ్ సీజనలో ప్రభుత్వం రైతులకు 50 శాతం రాయితీపై పచ్చి రొట్ట ఎరువు విత్తనాలు అందించడం జరుగుతుందని, రైతులు ఆర్బీకేల్లో తీసుకోవాలని ఏఓ సునీత తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణానికి ముందుకొచ్చేందుకు అధికారులందరూ అవగాహన కల్పించాలని హౌసింగ్ ఏఈ పేర్కొన్నారు. వేమూరు మండలంలో మంజూరైన ఇళ్లు 2,500లని, గృహాల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులు 426 మంది అని ఆయన తెలిపారు. లబ్ధిదారులకు వైఎస్సార్ క్రాంతి పథం నుంచి రూ.35వేలు రుణం అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మోహనరావు, ఎంపీపీ సునీత, ఉపాధ్యక్షులు షేక్ బాజీ, మండల కో-ఆప్షన్ మెంబరు తలతోటి సువర్ణరావు, ఎంపీటీసీ వేమూరి సుజాత, దాది రజినికుమారి, ఈపూరు కుసుమ కుమారి, గ్రామ సర్పంచ్‌లు కొక్కిల గడ్డ సుమతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## షాలెం రాజుకు బెస్ట్ సర్వీస్ అవార్డు

**వేమూరు:** గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలెం రాజు నేషనల్ బెస్ట్ సర్వీస్-2023 అవార్డు అందుకున్నారు. ఈ నెల 23 సికింద్రాబాద్‌లో తాను అవార్డు అందుకున్నట్లు ఆయన గురువారం తెలిపారు. ఎంవీఆర్ కల్చరల్ అకాడమీ అవార్డు ప్రదానం చేసినట్లు చెప్పారు. భట్టిప్రోలు మండలంలోని పల్లి కొన గ్రామానికి చెందిన కైతేపల్లి షాలెం రాజు గ్రేస్ ఫౌండేషన్ ద్వారా అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సేవలకు గుర్తింపుగా అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందని ఆయన చెప్పారు.

## బైకులు ఢీకొని నలుగురికి గాయాలు



బుద్ధాం గ్రామం వద్ద రోడ్డుపై పడి ఉన్న బైకులు

**కర్లపాలెం:** రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొనడంతో నలుగురుకి గాయాలైన ఘటన బుద్ధాంలో గురువారం చోటు చేసుకుంది. కర్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరం గ్రామానికి చెందిన ఆసోది కార్తీక్ ద్విచక్ర వాహనంపై బాపట్ల వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బుద్ధాం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు ట్రాక్టెయిన్‌ను దాటి వెళ్లే క్రమంలో ఎదురుగా వచ్చి తన బైకును ఢీకొట్టినట్లు కార్తీక్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో కార్తీక్‌తో పాటు మరో బైక్‌పై ఉన్న భార్యభర్తలు, చిన్నారికి గాయాలైనట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గాలి వాన బీభత్సం



దోనేపూడిలో వర్షపు నీటిలో మొక్కజొన్న



విరిగిపడిన స్తంభం

**కొల్లూరు:** గాలి వాన బీభత్సం సృష్టించింది. గురువారం సాయంత్రం అకస్మాత్తుగా ఉరుములు, పెను గాలులతో కూడిన వర్షం పడటంతో.. వాణిజ్య పంటలకు నష్టం చేకూర్చింది. కొల్లూరు మండలంలోని కృష్ణా నదీపరివాహక ప్రాంతాల్లో అధికంగా సాగు చేసిన పంటలు నేలవాలాయి. చివరి దశలో ఉన్న మొక్కజొన్న పంట, పచ్చి ఇటుకలు తడిచి పోయాయి. గాలుల తీవ్రత అధికంగా ఉండటంతో విద్యుత్తు స్తంభాలు, భారీ వృక్షాలు నేల కూలాయి. తిప్పలకట్ట, పోతార్లంక, జువ్వలపాలెం, కిష్కింద పాలెం, తోకలవారిపాలెం ప్రాంతాల్లో అరటి, తమలపాకు తోటలు దెబ్బతిన్నాయి. సుగ్గునలంక, చిలుమూరు, ఈపూరు, చింతర్లంక, ఈపూరులంక ప్రాంతాల్లో స్వల్పంగా పంటలు దెబ్బతిన్నాయి. అరటి, తమలపాకు పంటలపై గాలి వాన ప్రభావం తీవ్రంగా పడింది. భారీగా నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు. కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న పంట వర్షానికి తడిచిపయింది. వర్షం కారణంగా చివరి దశలో ఉన్న ఇటుక పరిశ్రమలోని పచ్చి ఇటుకలు తడిచి, పనికిరాకుండా పోయాయి. జువ్వలపాలెం, గాజుల్లంక, కొల్లూరు సబ్‌స్టేషన్‌ల పరిధిలో సుమారు 25 వరకు విద్యుత్తు స్తంభాలు విరిగి పడటం, తీగలు తెగిపోవడటంతో విద్యుత్తు శాఖకు సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌కో అధికారులు పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో తాటి చెట్లు, భారీ వృక్షాలు రహదారులకు అడ్డుగా విరిగిపడటంతో స్థానికులు వెంటనే స్పందించి రోడ్లపై పడిన వృక్షాలను తొలగించారు. పలు గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో విద్యుత్తు శాఖ సిబ్బంది సరఫరాను పునరుద్ధరించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కన్నావారితోట బ్రాంచి, 96-1-95, మెయిన్‌రోడ్, పట్టాభిపురం, కన్నావారితోట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004. ఫోన్: -91 863 2216530

**స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

[illegible]

1) రుణగ్రహీత(లు) / తనఖాదారు(లు) / హామీదారు(లు): 1) అప్లికెంట్: శ్రీ తుంగ రాము, తండ్రి: కోటేశ్వరరావు, [illegible] 2) కో-అప్లికెంట్: శ్రీమతి తుంగ ప్రమీల, భర్త: తుంగ రాము, [illegible] బకాయిమొత్తం: 18-12-2022 నాటికి [illegible] రూ.23,87,881.80/- [illegible] రూ.18,28,142.96/- [illegible]

స్థిరాస్తి యొక్క వివరములు

ఆస్తి నెం-1: [illegible]

రిజర్వు ధర: రూ.74,55,000/- | ధరావతు: రూ.7,46,000/- | బిడ్ పెంపుదల: రూ.75,000/-

ఆస్తి నెం-2: [illegible] 352.545 [illegible] 296.137 [illegible]

రిజర్వు ధర: రూ.40,38,000/- | ధరావతు: రూ.4,04,000/- | బిడ్ పెంపుదల: రూ.40,000/-

ఇ-వేలం తేది మరియు సమయం : 27-06-2023, మ॥ 3-00 గం॥ల నుండి సా॥ 5-00 గం॥ల వరకు (10 నిముషాల అపరిమిత స్వయం పొడిగింపులతో) ఇ వేలం వెబ్‌సైట్: www.mstcecommerce.com

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు అందించిన వెబ్‌సైట్ లింక్ అనగా www.unionbankofindia.co.in నందు సంప్రదించండి.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకం ప్రకటన

[illegible]

తేది : 24-05-2023 | సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
ప్రదేశం : గుంటూరు | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా